# కలం
ప్రజల గళం...

kalamdaily.com

Follow on: Kalamtelugu

బుధవారం • 15-04-2026

పేజీలు: 3




SINGLE TOPIC

సీట్ – ఫైట్



# డీలిమిటేషన్ హీట్

## కేంద్రం డ్రాఫ్ట్‌తో మరింత రాజుకున్న చిచ్చు

లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రెడీ అయింది. డ్రాఫ్ట్ బిల్లును ఎంపీలకు పంపింది. ప్రస్తుతమున్న 543 సీట్లను 850కి పెంచనున్నట్లు పేర్కొంది. 2011 జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరగనున్నట్లు తెలుస్తున్నది. ఇలా జరిగితే తెలంగాణ, ఏపీ, కేరళ, తమిళనాడు, కర్నాటక వంటి దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

జనాభా ప్రాతిపదికన పెంచితే ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి నాలుగైదు రాష్ట్రాల ఎంపీ సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా తమిళనాడు సీఎం స్టాలిన్ వంటి కీలక నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హైబ్రిడ్ విధానాన్ని అనుసరించాలంటూ రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. డీలిమిటేషన్ విధానాన్ని సౌత్ తప్పుపడుతున్న తరుణంలోనే కేంద్రం ఏకంగా డ్రాఫ్ట్ కాపీని ఎంపీలకు పంపడం.. ఈ నెల 16 నుంచి జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో దాన్ని ప్రవేశపెట్టనుండటం మరింత హీట్ పుట్టిస్తున్నది.

మహిళా రిజర్వేషన్ల అంశం కూడా తాజా డ్రాఫ్ట్‌లో స్పష్టంగా ఉంది. రొటేషన్ పద్ధతిలో ఈ కోటాను అమలు చేయనున్నారు. మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా మహిళా రిజర్వేషన్ల బిల్లును అదనపు సవరణతో కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. డీలిమిటేషన్, ఉమెన్ రిజర్వేషన్ బిల్లు ప్రధానంగా తాజా పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి.

ఎంపీలకు కేంద్రం పంపిన డ్రాఫ్ట్‌లో ఏముంది? డీలిమిటేషన్‌పై పార్లమెంట్‌లో ఏ నిర్ణయం తీసుకోనున్నారు? ప్రతిపక్షాలు ఎలా స్పందించనున్నాయి? వంటి అంశాలపై కలం ప్రత్యేక కథనం..

- తెలంగాణ బ్యూరో, కలం

**543 నుంచి 850కి పెరగనున్న లోక్‌సభ సీట్లు**

**రొటేషన్ పద్ధతిలో మహిళా రిజర్వేషన్లు**

**16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు**

**2011 జనాభా లెక్కల ఆధారంగా సీట్లు పెంచే యోచనలో కేంద్రం**

**అలా జరిగితే సౌత్‌కు తీరని నష్టం.. పోరాటానికి ప్రతిపక్షాలు రెడీ**



## సౌత్‌లో లోక్‌సభ సీట్లు ఇలా..

| రాష్ట్రం | ప్రస్తుతం | డీలిమిటేషన్ తర్వాత (అంచనా) |
|---|---|---|
| తెలంగాణ | 17 | 26 |
| ఆంధ్రప్రదేశ్ | 25 | 38 |
| కర్ణాటక | 28 | 42 |
| తమిళనాడు | 39 | 59 |
| కేరళ | 20 | 30 |
| పుదుచ్చేరి | 1 | 1 |
| మొత్తం | 130 | 196 |

## సౌత్ వర్సెస్ నార్త్

| | ప్రస్తుతం | డీలిమిటేషన్ తర్వాత (అంచనా) |
|---|---|---|
| సౌత్ స్థానాలు | 130 | 196 |
| నార్త్ స్థానాలు | 413 | 619 |
| వ్యత్యాసం | 283 | 423 |

నోట్: కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రత్యేకంగా మరో 35 స్థానాల కేటాయింపు

## యూటీలకు 35 సీట్లు

లోక్‌సభలో ప్రస్తుతం 543 స్థానాలు ఉండగా, అవి 850కి పెరగనున్నాయి. ఇందుకోసం రాజ్యాంగ సవరణ చేసేలా కేంద్ర ప్రభుత్వం బిల్లును రూపొందించింది. ఈ నెల 16 నుంచి వరుసగా మూడు రోజుల పాటు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లును ఉభయ సభల్లో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలనుకుంటున్నది. ఈ మేరకు బిల్లు ముసాయిదా కాపీలు పార్లమెంటు సభ్యులకు అందాయి. మొత్తం 850 స్థానాల్లో 815 ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలు ఎన్నుకునేలా ఉంటాయి. మిగిలిన 35 స్థానాలు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఉంటాయి. అయితే కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం వహించే లోక్‌సభ సభ్యులు ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడతారా? లేక పార్లమెంట్ ఇందుకోసం ప్రత్యేక విధానాన్ని అమలులోకి తెస్తుందా? అదే దానిపై స్పష్టత రావాల్సి ఉన్నది.

## జనాభా లెక్కలే ఆధారం!

డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా లోక్‌సభలో సీట్ల సంఖ్యను పెంచేలా బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. లోక్‌సభ స్థానాలను పునర్ విభజించేందుకు, సరిహద్దులను మార్చేందుకు, సీట్ల సంఖ్యను పెంచేందుకు జనాభాను ప్రాతిపదికగా తీసుకోనున్నది. ఏ జనాభా లెక్కల గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటారన్నది పార్లమెంట్ ఆమోదించిన చట్టం మేరకు ఉంటాయని ఆ బిల్లులో పేర్కొన్నది. డీలిమిటేషన్ ప్రక్రియ కోసం రాజ్యాంగంలోని 82వ అధికరణానికి సవరణలు జరగనున్నాయి. తప్పనిసరి డీలిమిటేషన్ చేయాలన్న ప్రొవిజన్‌ను తొలగించే అవకాశమున్నది. ఈ ఆర్టికల్‌లో 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఉన్నందున, ఆ క్లాజ్‌ను తొలగించేలా తాజా బిల్లులో సవరణ చేయనున్నది.

## కమిషన్ ఏర్పాటు.. విధానం ఖరారు

ఉభయ సభల్లో చర్చల అనంతరం డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందితే.. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పడుతుంది. లోక్‌సభ స్థానాలను 850కి పెంచేలా ఇప్పటికే ముసాయిదా బిల్లు రెడీ అయింది. ఈ సీట్ల సంఖ్యను పెంచడానికి అనుసరించాల్సిన విధానాన్ని డీలిమిటేషన్ కమిషన్ ఖరారు చేస్తుంది. కేంద్రం ప్రవేశపెట్టే బిల్లు ఆమోదం పొందిన వెంటనే రాష్ట్రపతి అప్రూవల్‌తో చట్టబద్ధత లభిస్తుంది. దీని ఆధారంగా డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటవుతుంది. కమిషన్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. అవసరమైతే ఆ పదవీకాలాన్ని పొడిగించడంపైనా కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుంది.

## కమిషన్‌లో ఎవరెవరుంటారు?

డీలిమిటేషన్ కమిషన్‌కు చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉంటారు. కేంద్ర ప్రభుత్వం ఆ జడ్జిని ఖరారు చేస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ లేదా ఆయన సిఫారసుతో ఒక ఎన్నికల కమిషనర్ ఇందులో సభ్యులుగా ఉంటారు. ఇక ప్రతి రాష్ట్రానికి చెందిన ఎన్నికల కమిషనర్ (స్టేట్ ఎలక్షన్ కమిషనర్) సభ్యులుగా ఉంటారు. కానీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎక్స్-అఫీషియో సభ్యులుగా మాత్రమే ఉంటారు. ఆయా రాష్ట్రాల్లోని లోక్‌సభ స్థానాలు, శాసనసభ స్థానాలను డీలిమిటేషన్ చేసే ప్రక్రియలో కమిషన్ సభ్యులకు సహాయం చేయడానికి ప్రతి రాష్ట్రం నుంచి ఐదుగురు లోక్‌సభ సభ్యులు, ఐదుగురు ఎమ్మెల్యేలు అసోసియేట్ సభ్యులుగా ఉంటారు. కానీ కమిషన్ తీసుకునే నిర్ణయాల్లో వీరికి ఓటింగ్‌లో పాల్గొనే అధికారం ఉండదు. చర్చల్లో మాత్రమే పాల్గొని వారి అభిప్రాయాలను ఇవ్వగలుగుతారు.

## 2011 జనాభా లెక్కలతోనే!

నియోజకవర్గాల పునర్విభజనకు లేటెస్ట్‌గా అందుబాటులో ఉండే సెన్సస్ (జనాభా లెక్కలు)ను డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుంది. జనాభాకు అనుగుణంగా లోక్‌సభ, శాసనసభ నియోజకర్గాల సరిహద్దులను తిరిగి నిర్ణయించే ప్రక్రియను ఈ కమిషన్ చేపడుతుంది. దేశంలోని ఓటర్లందరికీ సమాన ప్రాతినిధ్యం ఉండేలా ఈ కమిషన్ చూస్తుంది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటయ్యే సమయానికి ఏ జనాభా లెక్కలు లేటెస్టుగా ఉంటే వాటినే ఈ కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుంది. ప్రస్తుతానికి 2011 జనాభా లెక్కలు మాత్రమే పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. 2027 డిజిటల్ సెన్సస్ ప్రక్రియ ఇంకా పూర్తికానందున, ఆ లెక్కల నివేదిక ప్రభుత్వానికి చేరనందున, దీన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదు. అంటే 2011 లెక్కలనే పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలుస్తున్నది. గతంలో 2001 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ, శాసనసభ నియోజకర్గాల సరిహద్దులను అప్పటి డీలిమిటేషన్ కమిషన్ ఖరారు చేసింది. కానీ సంఖ్య మాత్రం మారలేదు.

## కోర్టుల్లో సవాల్ చేసే అధికారం లేదు

డీలిమిటేషన్ కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని లేదా అది రూపొందించిన నివేదికను ఎవరూ కోర్టుల్లో సవాల్ చేయడానికి వీల్లేదు. కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్‌లలో డీలిమిటేషన్ కమిషన్ నివేదిక విడుదలైన తర్వాత దాన్ని ఏ కోర్టులోనూ ఛాలెంజ్ చేయడం సాధ్యం కాదు. గెజిట్‌లో అది ప్రచురించిన సమాచారాన్ని వెంటనే పార్లమెంట్ లేదా రాష్ట్రాల అసెంబ్లీ ముందు ఉంచాలి. కేంద్ర ప్రభుత్వం నిర్దిష్టంగా పేర్కొన్న నిబంధనల మేరకు నిర్దేశిత సమయంలో నివేదికను లేదా నియోజకవర్గాల విభజన ఉత్తర్వులను గెజిట్ ద్వారా ప్రచురించాలి.

## మెజారిటీ నిర్ణయమే ఫైనల్

డీలిమిటేషన్ కమిషన్ సభ్యుల్లో ఏదేని అంశం లేదా నిర్ణయంపై భిన్నాభిప్రాయం ఉన్నట్లయితే మెజారిటీ సభ్యుల అభిప్రాయమే ఫైనల్ నిర్ణయంగా ఉంటుంది. మెజారిటీ సభ్యులు వెలిబుచ్చిన అభిప్రాయాల ఆధారంగానే కమిషన్ నిర్ణయాన్ని తీసుకుని వెలువరిస్తుంది. కమిషన్‌లో ఎవరైనా ఒక సభ్యుడు లేదా అసోసియేట్ సభ్యుల గ్రూపులోని ఒక సభ్యుడు తాత్కాలికంగా హాజరు కాకపోయినా కమిషన్ తన విధులను యథావిధిగా కొనసాగించుకోవచ్చు. కమిషన్‌లో రెగ్యులర్ సభ్యుల పోస్టు లేదా అసోసియేట్ సభ్యుల గ్రూపులోని ఒక పోస్టు ఏదైనా కారణం చేత ఖాళీగా ఉన్నా కూడా కమిషన్ చేసే పనులు లేదా తీసుకునే నిర్ణయాలు ఆగిపోవాల్సిన అవసరం లేదు. కేవలం ఒక సభ్యుడు హాజరుకాలేదనో లేక పదవి ఖాళీగా ఉందనే కారణంతో, కమిషన్ తీసుకున్న ఏ నిర్ణయాన్ని లేదా ప్రక్రియను చట్టవిరుద్ధమని ప్రశ్నించడానికి వీలులేదు.

## రొటేషన్ పద్ధతిలో మహిళా రిజర్వేషన్లు

డీలిమిటేషన్ ఎక్సర్‌సైజ్‌తో పాటు మహిళలకు మొత్తం సీట్లలో మూడో వంతు సీట్లు రిజర్వు కానున్నాయి. ఈ విధానం వెంటనే అమల్లోకి రానున్నది. మహిళలకు రిజర్వు చేసిన స్థానాలు ప్రతి డీలిమిటేషన్‌లో రొటేషన్ పద్ధతిలో మారుతూ ఉంటాయి. ఒక డీలిమిటేషన్ కాలవ్యవధిలో ఒక నియోజకవర్గం మహిళలకు రిజర్వు అయినట్లయితే, మరో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పడి నియోజకవర్గాల పునర్విభజన చేసేంత వరకు ఆ నిర్దిష్ట నియోజకవర్గం మహిళలకే రిజర్వు అవుతుంది. రెండో డీలిమిటేషన్ ఖరారు చేసిన తర్వాత మరో నియోజకవర్గం మహిళలకు రిజర్వు అవుతుంది. ఆ ప్రకారం ఒక డీలిమిటేషన్ కమిషన్ ఉనికిలో ఉన్నంతవరకు మహిళలకు రిజర్వు చేసిన నియోజకవర్గం ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతుంది. గరిష్టంగా 15 సంవత్సరాలు మహిళలకు ఆ నియోజకవర్గం రిజర్వు అయ్యేలా ముసాయిదా బిల్లులో కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది.



## అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం



దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేలా.. ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించేలా డీలిమిటేషన్ ప్రక్రియ ఉంటే.. మొత్తం తమిళనాడు రాష్ట్రం స్తంభించిపోయేలా భారీ నిరసనలు చేపడతాం. ప్రతి కుటుంబం రోడ్డుపైకి వచ్చి పోరాడుతుంది. తమిళనాడు నుంచి మోదీకి ఇస్తున్న తుది హెచ్చరిక ఇది. తమిళనాడు ప్రయోజనాలకు భంగం కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటే.. మేము చూస్తూ ఊరుకోం. డీలిమిటేషన్ ప్రక్రియను కేంద్రం ఎందుకు ఇంత గోప్యంగా ఉంచుతున్నది? పారదర్శకంగా ప్లాన్లను ఎందుకు ప్రకటించడం లేదు? దక్షిణాది రాష్ట్రాలపై డీలిమిటేషన్ ప్రభావం ఉండదని ప్రధాని మోదీ పార్లమెంట్‌లో హామీ ఇవ్వాలి. ఇంత వరకు మోదీ ఎందుకు స్పందించలేదు? దీనిపై చర్చించేందుకు అపాయింట్మెంట్ కోరినా పట్టించుకోలేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును బలవంతంగా ఆమోదించుకోవాలని కేంద్రం చూస్తున్నది.

- ఎంకే స్టాలిన్, తమిళనాడు సీఎం

## రేవంత్‌ది వితండవాదం



డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలన్నదే కేంద్రం విధానం. సీఎం రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారు. హైబ్రిడ్ నమునా అంటూ జనాల్ని తప్పదోవ పట్టిస్తున్నారు. ఆయన చెబుతున్న హైబ్రిడ్ నమునా.. ప్రపంచంలో ఎక్కడా లేదు. రేవంత్ రెడ్డి చెప్పిన విధానం తెలంగాణలో కూడా అమలు చేస్తారా? అప్పుడు ఆదిలాబాద్‌కు సీట్లు తగ్గించి, హైదరాబాద్‌కు పెంచుతారా? తెలంగాణ ఆదాయంలో 70 శాతం హైదరాబాద్ నుంచే వస్తున్నది. అలాంటప్పుడు 70 శాతం సీట్లు హైదరాబాద్ పరిసరాల్లోనే ఉండాలి కదా! రేవంత్ రెడ్డి ప్రతిపాదన అంబేద్కర్ విధానానికి వ్యతిరేకం. రేవంత్ చెప్పినట్టు చేస్తే, గుజరాత్‌కు ఎక్కువ సీట్లు వస్తాయి. కాంగ్రెస్ వాళ్లు వితండవాదం పక్కనపెట్టి బిల్లుకు సహకరించాలి.

- కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి



డీలిమిటేషన్‌కు కేంద్రం అనుసరిస్తున్న విధానంపై చర్చించేందుకు ప్రతిపక్షాలు ఏకమయ్యాయి. డీలిమిటేషన్ పేరిట శాశ్వతంగా అధికారంలో ఉండేలా బీజేపీ స్కెచ్ వేసిందని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని అంటున్నాయి. లేటెస్ట్ జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచాలని చూస్తే, అది దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం చేసినట్లే అవుతుందని మండిపడుతున్నాయి. నార్త్‌తో పోలిస్తే జనాభా నియంత్రణను సౌత్ పటిష్టంగా అమలు చేసిందని గుర్తుచేస్తున్నాయి. 2011 జనాభా లెక్కలను

### సౌత్‌కు తీరని అన్యాయం

పరిగణనలోకి తీసుకున్నా.. 2027 డిజిటల్ సెన్సస్‌ను పరిగణనలోకి తీసుకున్నా.. సౌత్‌లో జనాభా తక్కువే ఉంటుందని, సీట్ల పెంపునకు దాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే అన్యాయం జరుగుతుందని చెప్తున్నాయి. గురువారం నుంచి పార్లమెంట్ తిరిగి ప్రారంభం కానుండడం, మూడు రోజుల పాటు జరిగే సమావేశాల్లోనే డీలిమిటేషన్ బిల్లును ఉభయ సభల ముందుకు కేంద్రం తెస్తుండటంతో.. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు బుధవారం ప్రతిపక్షాలు సమావేశం కానున్నాయి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది.

# హైబ్రిడ్ నమూనా ఉండాల్సిందే..!



### సౌత్‌కు అన్యాయం చేస్తే ఒప్పుకోం: సీఎం రేవంత్ రెడ్డి
### ప్రధాని మోదీకి లేఖ

**కలం, తెలంగాణ బ్యూరో:** లోక్ సభ సీట్ల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా జాతీయస్థాయిలో విస్తృత చర్చలు జరపాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు, ఏకాభిప్రాయ సాధన ద్వారానే లోక్‌సభ సీట్ల పెంపుపై కీలక నిర్ణయాలు తీసుకోవాలని తేల్చిచెప్పారు. హైబ్రిడ్ విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తే ఊరుకోబోమన్నారు. కేంద్రం సోమవారం ఎంపీలకు డ్రాఫ్ట్ బిల్లును పంపిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్, పునర్విభజన, లోక్‌సభ సీట్ల పెంపు .. ఇలా మూడు వేర్వేరు అంశాలను ఒకదానితో ఒకటి ముడి పెట్టొద్దని, ప్రజల్లో గందరగోళం సృష్టించొద్దని ఆయన పేర్కొన్నారు. హైబ్రిడ్ నమూనా (50:50 ఫార్ములా)ను సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. "కేంద్రం 272 లోక్ సభ సీట్లు పెంచాలనుకుంటే.. అందులో 50శాతం సీట్ల (136)ను జనాభా ప్రాతిపదికన.. మరో 50% సీట్లు (136) రాష్ట్రాల జీఎస్డీపీ ప్రకారం కేటాయించాలి. అందరికీ న్యాయం జరిగేలా ఒక స్థిరమైన పరిష్కారం అవసరం. హైబ్రిడ్ మోడల్ ఒక ప్రత్యామ్నాయం. అందరి ప్రాతినిధ్యంతో పాటు అన్ని రాష్ట్రాల సహకారానికి ఈ మోడల్ సమతుల్యం. సుప్రీంకోర్టు సూచించిన 50 శాతం– 50 శాతం విధానమే ఇందుకు ఉదాహరణ" అని ఆయన వివరించారు.

**ప్రో రేటా పద్ధతిని ఒప్పుకోం**

డీలిమిటేషన్‌పై అత్యవసరంగా ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీకి లేఖలో సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రో రేటా పద్ధతిలో సీట్ల పెంపు చేస్తే దేశ ఫెడరల్ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ''తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలు దశాబ్దాలుగా జనాభా స్థిరీకరణ, ఆరోగ్యం, మానవ అభివృద్ధి రంగాల్లో కృషి చేశాయి. ఇవన్నీ జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా చేపట్టిన చర్యలు. ప్రస్తుత డీలిమిటేషన్ ప్రతిపాదనతో ఈ రాష్ట్రాలన్నీ నిర్మాణాత్మకంగా నష్టపోతాయి. రాజకీయంగా బలహీనపడే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రో రేటా మోడల్ కేవలం గణాంకాల మార్పుగా కాకుండా, రాజకీయ అసమతుల్యతకు దారి తీస్తుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు నిధుల పంపిణీలో ఇప్పటికే పక్షపాతం, వివక్ష ఉన్నాయి. నిధుల వివక్షకు అదనంగా ఇప్పుడు సీట్ల పెంపు కారణంగా రాజకీయంగా అన్యాయం జరుగుతుంది" అని తెలిపారు. ''ఆర్థిక సహకారం, సామాజిక, మానవ అభివృద్ధి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రోరేటా పద్ధతిలో సీట్ల పెంపు చేస్తే దేశ ఫెడరల్ సమతుల్యత దెబ్బతింటుంది. అందరికీ న్యాయం జరిగేలా డీలిమిటేషన్ ఉండాలి" అని ప్రధాని మోదీకి రాసిన లేఖలో సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### ఒకే ఎంపీ సెగ్మెంట్ పరిధిలో అసెంబ్లీ స్థానం

కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కోసం రూపొందించిన ముసాయిదా బిల్లులో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలపై స్పష్టత ఇచ్చింది. ఏ అసెంబ్లీ స్థానమైనా దాని పూర్తి సరిహద్దులు ఒకే పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఉండాలని నొక్కి చెప్పింది. డీలిమిటేషన్ కమిషన్ ఆయా రాష్ట్రాల్లోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను ఖరారు చేసేటప్పుడు ఈ అంశాన్ని గమనంలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఏ అసెంబ్లీ నియోజకవర్గమైనా ఒకటి కంటే ఎక్కువ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉండకుండా చూసుకోవాలని స్పష్టత ఇచ్చింది.




నిర్దిష్టంగా ఏ రాష్ట్రంలోనైనా లోక్‌సభ సీట్ల సంఖ్య ఎంత పెరుగుతున్నదో.. అదే నిష్పత్తిలో ఆ రాష్ట్రంలోని అసెంబ్లీ సీట్ల సంఖ్య కూడా పెరగాలని కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ముసాయిదా బిల్లులో స్పష్టం చేసింది. నిష్పత్తి క్రమం తప్పకూడదని నొక్కిచెప్పింది. ఉదాహరణకు ఒక రాష్ట్రంలో 6 లోక్‌సభ స్థానాలు పెరుగుతున్నాయనుకుంటే.. పెరగనున్న అసెంబ్లీ సీట్ల సంఖ్య కచ్చితంగా ఆరో ఎక్కంతో సరిపోయేలా ఉండాలి.

- ఉదాహరణకు తెలంగాణలో ప్రస్తుతమున్న లోక్‌సభ స్థానాల సంఖ్య 17. ఇది డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాత 26 అవుతుందని అంచనా. అంటే 9 సీట్లు పెరుగుతున్నాయి. ఈ నిష్పత్తిలోనే అసెంబ్లీ సీట్ల సంఖ్య కూడా పెరగాలి. అలా పెరిగే స్థానాల సంఖ్య కచ్చితంగా తొమ్మిదో ఎక్కానికి అనుగుణంగా ఉండాలి. అంటే 54 పెరగాలి లేదా 63 పెరగాలి లేదా 72 పెరగాలి. కానీ తెలంగాణలో ప్రతి లోక్‌సభ స్థానానికి 7 చొప్పున అసెంబ్లీ సీట్లు ఉన్నందున.. ఇప్పుడు 9 లోక్‌సభ స్థానాలు పెరిగితే అసెంబ్లీ సీట్ల సంఖ్య 63 పెరగాల్సి ఉంటుంది. దీంతో ఇప్పుడున్న 119 అసెంబ్లీ సీట్లు 182 అవుతాయి (119+63).

### డీలిమిటేషన్ కమిషన్‌కు సంపూర్ణ అధికారాలు

కేంద్ర ప్రభుత్వం నియమించే డీలిమిటేషన్ కమిషన్‌కు సంపూర్ణ అధికారాలు ఇచ్చి స్వతంత్ర వ్యవస్థగా పనిచేసేలా గైడ్‌లైన్స్ రూపొందిస్తున్నది. సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం సివిల్ కోర్టుల తరహాలోనే డీలిమిటేషన్ కమిషన్‌కు కూడా అధికారాలు ఉంటాయి. ఒక సాక్షిని విచారణకు సమన్ చేయడం లేదా ఎన్‌ఫోర్స్ చేసే అధికారం ఉంటుంది. ఏదైనా డాక్యుమెంట్ అవసరం ఉన్నట్లయితే అది కలిగిన వ్యక్తిని లేదా వ్యవస్థను పిలిచి దాన్ని కమిషన్‌కు అందజేయాలని ఆదేశించే అధికారముంటుంది. ఏదైనా ఆఫీసు లేదా కోర్టులో ఒక డాక్యుమెంట్ లేదా రికార్డు ఉన్నట్లయితే దాన్ని కమిషన్‌కు అందజేయాలని ఆదేశించే అధికారం ఉంటుంది. భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 384, 385 ప్రకారం డీలిమిటేషన్ కమిషన్ ఒక సివిల్ కోర్టులాగా వ్యవహరించవచ్చు.